



# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

మంగళవారం,
ఏప్రిల్ 1, 2025

సంపుటి : 10 | సంచిక :14 | రంగారెడ్డి | ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ | పేజీలు 8 | వెల 4/-


# పోలీసు పహారాలో హెచ్‌సీయూ

**విద్యార్థులపై అడుగడుగునా నిఘా .. ఐడీ కార్డు ఉంటేనే లోనికి అనుమతి**

**ఇద్దరు పీహెచ్‌డీ విద్యార్థులపై కేసు నమోదు**

**నేటి నుంచి అడ్మిన్ భవనం ముందు నిరవధిక నిరసన**



గచ్చిబౌలి/రాయదుర్గం: కంచె గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమిపై నెలకొన్న వివాదంతో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ క్యాంపస్ అట్టుడుకిపోతోంది. క్యాంపస్ మొత్తం పోలీసు పహారాలో ఉంది. మరోవైపు ఆందోలనలు కొనసాగిస్తున్న విద్యార్థులు, మంగళవారం నుంచి పోరాటం ఉధృతం చేయాలని నిర్ణయించారు. సోమవారం సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ దిష్టబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఇద్దరు పీహెచ్‌డీ విద్యార్థులపై కేసులు నమోదు చేసిన పోలీసులు..క్యాంపస్‌లో పటిష్టమైన నిఘా ఏర్పాటు చేశారు. ప్రధాన రహదారి నుంచి క్యాంపస్ ప్రధాన ద్వారం వరకు స్టాపర్స్ అమర్చారు. ప్రధాన ద్వారం వద్ద యూనివర్సిటీ హాస్టళ్ల ముందు గచ్చిబౌలి పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థుల కదలికలపై నిఘా పెట్టారు. రాష్ట్ర ప్రభుత్వం టీజీఐఐసీకి కేటాయించిన స్థలంలో ఎలాంటి ఆటంకం లేకుండా పనులు సాగేలా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. ఇక్కడ బందోబస్తును మాదాపూర్ అడిషనల్ డీసీపీ జయరాం పర్యవేక్షిస్తున్నారు.

### ఇద్దరు విద్యార్థుల రిమాండ్

పనులను అడ్డుకోవడం, తోపులాటకు దిగడంతో పోలీసు అధికారికి గాయాలయ్యాయంటూ టీజీఐఐసీ అధికారులు ఇచ్చిన ఫిర్యాదుతో గచ్చిబౌలి పోలీసులు హెచ్‌సీయూకు చెందిన ఇద్దరు పీహెచ్‌డి విద్యార్థులపై కేసు నమోదు చేశారు. పొలిటికల్ సైన్స్ పీహెచ్‌డీ స్కాలర్, హెచ్‌సీయూ స్టూడెంట్ యూనియన్ వైస్ ప్రెసిడెంట్ (ఎస్ఎఫ్ఐ) ఎర్రం నవీన్, కంప్యూటర్ సైన్స్ పీహెచ్‌డీ స్కాలర్, ఏబీవీపీ నాయకులు రోహిత్ బొండుగులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరిలించారు. వీరిపై

(మిగతా 2వ పేజీలో)



# హైదరాబాద్‌లో వాన్‌గార్డ్ తొలి జీసీసీ

**వాన్‌గార్డ్ ప్రతినిధులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**

**ఈ ఏడాది చివరి నాటికి ప్రారంభం..**

**నాలుగేళ్లలో 2,300 ఉద్యోగ అవకాశాలు**

**ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కంపెనీ ప్రతినిధుల భేటీ**

హైదరాబాద్: అమెరికాకు చెందిన ప్రతిష్టాత్మక సంస్థ 'వాన్‌గార్డ్' తొలిసారిగా భారతదేశంలో అంతర్జాతీయ సామర్థ్య కేంద్రం (గ్లోబల్ కేపబిలిటీ సెంటర్)ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయనుంది. ఈ ఏడాది చివరిలోగా ఈ కేంద్రాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేయనున్నట్లు.. రానున్న నాలుగేళ్లలో 2,300 మందికి ఉపాధి కల్పించనున్నట్లు ప్రకటించింది, వాన్‌గార్డ్ దాదాపు ఐదు కోట్ల మంది పెట్టుబడిదారులతో సుమారు 10.4 ట్రిలియన్ డాలర్ల సంస్థగా కొనసాగుతోంది. వాన్‌గార్డ్ సీఈవో సలీం రాంజీ, ఐటీ డివిజన్ సీఈవో, ఎండీ నితిన్ టాండన్, మానవ వనరుల ప్రధానాధికారి జాన్ కౌచర్, జీసీసీ%-%ఇండియా వాన్‌గార్డ్ హెడ్ వెంకటేశ్ నటరాజన్‌లు సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో భేటీ అయ్యారు. ముఖ్యమంత్రితోపాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఇతర ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ముఖ్యమంత్రితో జరిగిన చర్చల అనంతరం వాన్‌గార్డ్ తన నిర్ణయాన్ని ప్రకటించింది. ప్రస్తుతం ప్రకటించిన ఈ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ ఈ సంవత్సరం చివరి నాటికి నగరంలో

(మిగతా 2వ పేజీలో)

# కాంగ్రెస్ హామీల అమలుపై చేతులెత్తేసింది

**ఎక్కడికక్కడ ఆ పార్టీ నేతలను నిలదీద్దాం**

**కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి**



హైదరాబాద్,: రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ పార్టీ వెన్నుపోటు పొడిచిందని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయకుండా చేతులెత్తేసిందని ఆరోపించారు. ఆరు గ్యారంటీలు, హామీల అమలు కోసం కాంగ్రెసపై ఒత్తిడి తీసుకురావాలని, ఆ పార్టీ నేతలను

(మిగతా 2వ పేజీలో)



## విద్యార్థులపై లాఠీ-చార్జ్.. 400 ఎకరాలు అమ్మి రాష్ట్రాన్ని పాలిస్తారా?'



# 40 వేల ఎకరాలు అమ్ముతున్నావు.. ఆ 400 ఎకరాలు వదిలేయ్

**కాంక్రీట్ జంగిల్‌లో ఉన్న ఒకే ఒక లంగ్ స్పేస్ హెచ్‌సీయూ**

**రాహుల్‌గాంధీ ఎందుకు పట్టించుకోవడం లేదు**

**విద్యార్థులు చేస్తున్న ఆందోళనకు సంపూర్ణ మద్దతు**

**జేసీబీలు, బుల్డోజర్లు రాత్రికి రాత్రే పర్యావరణాన్ని నాశనం చేస్తున్నాయి**

**హెచ్‌సీయూ విద్యార్థులతో కలిసి మీడియాతో కేటీఆర్**

హైదరాబాద్: 40 వేల ఎకరాలను అమ్మకానికి పెట్టిన సీఎం రేవంత్‌రెడ్డి...హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాలను వదిలేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. హెచ్‌సీయూ భూములను విక్రయించొద్దంటూ విద్యార్థులు నిస్వార్థంగా చేస్తున్న ఆందోళనకు ఆయన సంపూర్ణ మద్దతు ప్రకటించారు. సోమవారం తెలంగాణభవన్‌లో కేటీఆర్ హెచ్‌సీయూ విద్యార్థులు, విద్యార్థి సంఘ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. వందలాది మంది పోలీసులు, జేసీబీలు, బుల్డోజర్లతో వేలాది వృక్షాలను నేలకూల్చడంతోపాటు, నెమళ్లు, దుప్పులు, జింకలు, అరుదైన పక్షిజాతులను అక్కడ నుంచి తరలించే యత్నం చేస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. తెలంగాణ ఉద్యమ వీరుల త్యాగాల ఫలితమే సెంట్రల్ యూనివర్సిటీ అని చెప్పారు. యూనివర్సిటీ భూములు, విద్యార్థులపై ప్రభుత్వం రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. ఆ ప్రాంతం మొత్తం కాంక్రీట్ జంగిల్‌గా మారిందని అక్కడున్న ఈ లంగ్‌స్పేస్ లేకుండా చేయడంతో జీవవైవిధ్యాన్ని దెబ్బతీస్తున్నారని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి భూములు అమ్మడం, అప్పులు తేవడమే ఎజెండాగా పనిచేస్తున్నారని విమర్శించారు. ముంబైలో 2,500 చెట్లు కొడితేనే.. పర్యావరణం నాశనమైందని గొంతు చించుకున్న రాహుల్‌గాంధీ హెచ్‌సీయూ గురించి ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. హైకోర్టులో ఇప్పటికే ఈ అంశంపై పిల్ ఉన్న నేపథ్యంలో కోర్టుకు సెలవులున్న తరుణంలో రాత్రికిరాత్రే విధ్వంసం సృష్టిస్తున్నారన్నారు. ఈ అంశంపై తమ పార్టీ ఎంపీలు రాజ్యసభలో కేంద్రాన్ని ప్రశ్నిస్తారని,

(మిగతా 2వ పేజీలో)

# అటు పుతిన్ కు, ఇటు జెలెన్ స్కీకి... ఇద్దరికీ వార్నింగ్ ఇచ్చిన ట్రంప్

**యుద్ధం ముగింపునకు తనదైన శైలిలో ప్రయత్నిస్తున్న ట్రంప్**

**ఉక్రెయిన్ లో రక్తపాతం ఆగకపోతే పుతిన్ దే బాధ్యత అని వెల్లడి**

**అదే జరిగితే పుతిన్ ను ఉపేక్షించబోనని హెచ్చరిక**

**అరుదైన ఖనిజాల ఒప్పందం నుంచి ఉక్రెయిన్ వైదొలగితే కష్టాలు తప్పవు**



రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలకడానికి తనదైన శైలిలో ప్రయత్నాలు చేస్తున్న అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు పుతిన్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీలకు కీలక సందేశాలు పంపారు. తమ మాట వినకపోతే ఉపేక్షించేది లేదన్న కోణంలో స్పష్టమైన సంకేతాలు పంపారు. యుద్ధం కొనసాగితే పుతిన్‌ను ఉపేక్షించేది లేదని, రష్యాపై భారీ సుంకాలు విధిస్తానని ట్రంప్ హెచ్చరించారు. ఉక్రెయిన్‌లో రక్తపాతం ఆగకపోతే పుతిన్‌దే బాధ్యత అని ఆయన అన్నారు. అయితే, జెలెన్ స్కీకి కూడా ట్రంప్ గట్టి హెచ్చరికలు జారీ చేశారు. ఉక్రెయిన్ ఎప్పటికీ నాటోలో చేరకూడదని, ఒకవేళ ఉక్రెయిన్ అరుదైన ఖనిజాల ఒప్పందం

(మిగతా 2వ పేజీలో)

# 'రాజీవ్ యువ వికాసం పథకం' దరఖాస్తుల గడువు పొడిగింపు



**ఏప్రిల్ 14వ తేదీ వరకు గడువు పొడిగింపు**

**పకడ్బందీగా అమలు చేయాలని భట్టి ఆదేశం**

**వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న మంత్రి శ్రీధర్ బాబు, సీఎస్, పలువురు కలెక్టర్లు**

# రంజాన్ పండుగ మత సామరస్యానికి ప్రతీక!

## రంజాన్ పండుగ అందరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలి: డాక్టర్ ర్యాకల శ్రీనివాస్







యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి గణేష్ సాగర్ : భువనగిరి మండలం తాజ్ పూర్ గ్రామంలో ఈదుల్ ఫితర్ రంజాన్ పండుగను పురస్కరించుకొని ముస్లీం సోదరులు స్థానిక ఈద్గాలో రంజాన్ వేడుకలను సామూహిక ప్రార్థనలు చేసి ఘనంగా జరుపుకున్నారు. అనంతరం మైనార్టీ ముస్లిం సోదరులంతా తమ రంజాన్ పండుగకు ప్రతి సంవత్సరం రంజాన్ తోఫా అందిస్తూ, నిరుపేద మైనార్టీలు కు అండగా ఉంటూ, మసీదు అభివృద్ధికి కృషి చేస్తున్న బిఆర్ఎస్ జిల్లా నాయకులు, సామాజికవేత్త, డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ నివాసానికి వెళ్లి కలిశారు ఒకరినొకరు ఈద్ ముబారక్ తెలుపుకున్నారు. ర్యాకల శ్రీనివాస్ చేపట్టే కార్యక్రమాలు విజయవంతం కావాలని తన చేతికి దాట్టి కట్టారు, ఈ సందర్భంగా డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రేమ, దయ, సహనం, సంతోషాల కలయికే రంజాన్ మాసం అని మత సామరస్యానికి ప్రతీక రంజాన్ మాసం అన్నారు.అల్లా మీకు శాంతి,శ్రేయస్సును ప్రసాదించాలనీ ఈ రంజాన్ పండుగా అందరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని, అంతా సుఖ సంతోషాలతో జీవించాలని కోరుకుంటూ మైనార్టీ సోదరి, సోదరులందరికి ఈద్–ఉల్–ఫితర్ శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో హైమద్, యాకూబ్, అమర్, షరీఫ్, పాష, రఫీ, కరీం, బషీర్, సలీం, తదితరులు పాల్గొన్నారు






# పూర్ణ నంది తెలుగు తేజం అవార్డును అందుకున్న రాపర్తి సురేష్ గౌడ్

## స్ఫూర్తి ఫౌండేషన్ చేస్తున్న సేవలకు దక్కిన గౌరవం!



యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి గణేష్ సాగర్ : బేగంపేటలోని తెలంగాణ టూరిజం ప్లాజాలో జరిగిన వేగ జువెలర్స్ సంపంగి గ్రూప్ ఆఫ్ కంపెనీ అవార్డుల ప్రధానోత్సవం లో స్ఫూర్తి ఫౌండేషన్ చైర్మన్ గా అనేక స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహించిన, ఆ సంస్థ చైర్మన్ రాపర్తి సురేష్ గౌడ్ చేసిన సామాజిక సేవకార్యక్రమాలను గుర్తించి, వేగ జ్యువెలర్స్, సంపంగి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ వారు పూర్ణ నంది తెలుగు తేజం అవార్డును ప్రకటించారు. సోమవారం బేగంపేటలోని తెలంగాణ టూరిజం ప్లాజా లో జరిగిన అవార్డుల కార్యక్రమం లో రాపర్తి సురేష్ గౌడ్ కు హీరో జై, హీరోయిన్ ఐశ్వర్య, మాజీ మంత్రి సముద్రాల వేణు గోపాలచారి కలిసి అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత రాపర్తి సురేష్ గౌడ్ మాట్లాడుతూ. ఎన్నో సంవత్సరాలుగా చేస్తున్న సేవా కార్యక్రమాలు నేటి అవార్డుతో సామాజిక కార్యక్రమాలపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. ఈ అవార్డు రావడం మరింత బాధ్యత పెరిగిందని ఆయన పేర్కొన్నారు. మునుముందు ఇంత ఉత్సాహంతో స్ఫూర్తి ఫౌండేషన్ నుంచి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తానని తెలిపారు. నాకు నా గ్రామం పై ఉన్న ప్రేమతో అనేక కార్యక్రమాలు స్ఫూర్తి ఫౌండేషన్ ద్వారా చేపడుతున్నానని. విద్యార్థుల భవిష్యత్తు కై సమాజంలోని ఆడబిడ్డలు, యువత విజయాలు సాధించాలని. ప్రతి విద్యార్థికి చదువుకునే బలమైన కోరిక ఉంటే పేదరికం అడ్డురాదు. పేదోడి తలరాత మార్చేది కేవలం విద్య ఒక్కటే అని. విద్య తోటి సమాజంలో గౌరవం లభిస్తుందని అత్యున్నత స్థానాన్ని చేరుకుంటారని తెలిపారు

# సన్‌రైజర్స్ ఆరోపణలపై స్పందించిన హెచ్‌సీఏ

**మ్యాచ్ పాస్‌ల కోసం ఒత్తిడి చేస్తున్నారంటూ హెచ్‌సీఏపై సన్ రైజర్స్ ఆరోపణ**

**హెచ్‌సీఏ అధ్యక్షుడు బెదిరిస్తున్నారని వెల్లడి**

**ఈ నెల 29న సన్ రైజర్స్ ఈ-మెయిల్ కు బదులిచ్చామన్న హెచ్‌సీఏ**




ఐపీఎల్ మ్యాచ్ పాస్ ల కోసం తమను ఒత్తిడి చేస్తోందంటూ హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ)పై సన్ రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీ తీవ్ర ఆరోపణలు చేయడం తెలిసిందే. హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్ మోహన్ రావు సైతం బెదిరింపులకు పాల్పడుతున్నారని సన్ రైజర్స్ తన ఈ–మెయిల్ లో పేర్కొంది. ఉప్పల్ స్టేడియంలో ఓ మ్యాచ్ సందర్భంగా వీఐపీ బాక్స్ కు తాళం వేసుకున్నారని వెల్లడించింది. ఈ నేపథ్యంలో, సన్ రైజర్స్ ఆరోపణలపై హెచ్‌సీఏ స్పందించింది. ఈ నెల 29న ఈ–మెయిల్ ద్వారా సన్ రైజర్స్ ఆరోపణలకు సమాధానం ఇచ్చామని వెల్లడించింది. సన్ రైజర్స్ ఆరోపణలు పూర్తిగా అవాస్తవం అని స్పష్టం చేసింది. హెచ్‌సీఏ అధ్యక్షుడు వ్యక్తిగతంగా టికెట్లు అడగలేదని, కేవలం క్లబ్ కార్యదర్శుల కోసమే టికెట్లు అడిగారని వివరణ ఇచ్చింది.



# క్రమశిక్షణ దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే రంజాన్

## ::: దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ మార్చి 31 వార్త మిర్రర్ : త్యాగానికి ప్రతీక రంజాన్ పండుగ అని దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ అన్నారు. రంజాన్ పండుగను పురస్కరించుకొని దేవరకొండ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఎండి యూనిస్ స్వగృహంలో వారి కుటుంబ సభ్యులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రంజాన్ మాసంలో నిర్వహించే ఉపవాస దీక్షలు, దైవ ప్రార్థనలతో మతసామరస్యం, ఆనందం వెల్లి విరిశాయని అన్నారు. క్రమశిక్షణ దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే రంజాన్ మాసం విశిష్టత అని ఎమ్మెల్యే చెప్పారు. సేవా దృక్పథానికి, సహనానికి ప్రతీకగా ఈ పండుగను జరుపుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు ఈ కార్యక్రమంలో నల్గొండ పార్లమెంట్ కోఆర్డినేటర్ సిరాజ్ ఖాన్,మున్సిపల్ మాజీ చైర్మన్ ఆలంపల్లి నర్సింహా, వడ్త్య దేవేందర్ నాయక్,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ముక్కామల్ల వెంకటయ్య గౌడ్, పీఏసీఎస్ చైర్మన్లు డాక్టర్ వేణుధర్ రెడ్డి,శ్రీశైలం యాదవ్, సిపిఐ రాష్ట్ర నాయకులు పల్లా నర్సింహా రెడ్డి,పట్టణ మాజీ సర్పంచ్ పున్న వేంకటేశ్వర్లు,పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు యూనుస్,మాజీ ఎంపీపీలు జాని యాదవ్, ఏడ్పుల గోవింద్ యాదవ్,బిక్కు నాయక్,సీనియర్ నాయకులు తిపర్తి రూక్మా రెడ్డి, హన్మంతు వెంకటేష్ గౌడ్, యూత్ కాంగ్రెస్ నియోజక వర్గ అధ్యక్షులు కిన్నెర హరికృష్ణ, మాజీ ఎంపీటీసీ వెంకటయ్య,మాజీ కౌన్సిలర్లు భూదేవి సైదులు, రైస్, తౌఫీక్,యూత్ కాంగ్రెస్ నాయకులు , కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# 400 ఎకరాల భూమిపై 20 ఏళ్ల నాటి కీలక డాక్యుమెంట్లను విడుదల చేసిన తెలంగాణ ప్రభుత్వం

కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమి తమదేనని టీజీఐఐసీ చేసిన ప్రకటనపై హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం (హెచ్‌సీయూ) స్పందించింది. టీజీఐఐసీ ప్రకటనను హెచ్‌సీయూ ఖండించింది. ఈ మేరకు హెచ్‌సీయూ రిజిస్ట్రార్ ఒక ప్రకటన విడుదల చేశారు. 2024 జులైలో అక్కడ ఎలాంటి సర్వే నిర్వహించలేదని, ఇప్పటి వరకు భూమి ఎలా ఉందన్న దానిపై ప్రాథమిక పరిశీలన మాత్రమే చేశారని ఆ ప్రకటనలో తెలిపారు. హద్దులకు అంగీకరించినట్లు టీజీఐఐసీ చేసిన ప్రకటనను ఖండిస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటి వరకు భూమికి సరిహద్దులు గుర్తించలేదని, దీనిపై హెచ్‌సీయూకి సమాచారం ఇవ్వలేదని తెలిపారు. ఆ భూమిని విశ్వవిద్యాలయానికే ఇవ్వాలని చాలాకాలంగా కోరుతున్నామని, భూమి కేటాయించడంతో పాటు పర్యావరణం, జీవ వైవిధ్యాన్ని కాపాడాలని మరోసారి కూడా ప్రభుత్వాన్ని కోరతామని అన్నారు.

# హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై టోల్ ఛార్జీల తగ్గింపు!

ఇరువైపులా అయితే రూ. 115 వసూలు చేస్తారు. కొర్లపహాడ్ వద్ద ఒకవైపునకు రూ. 120, ఇరువైపులా అయితే రూ. 180, చిల్లకల్లు ప్లాజా వద్ద ఒకవైపునకు 105, ఇరువైపులా అయితే 155 వసూలు చేస్తారు. లైట్ కమర్షియల్ వాహనం, లైట్ గూడ్స్ వాహనం, మినీ బస్సుకు పంతంగిలో ఒకవైపునకు రూ. 125, ఇరువైపులా అయితే రూ. 190, కొర్లపహాడ్‌లో వరుసగా రూ. 195, రూ. 295, చిల్లకల్లులో వరుసగా రూ. 165, రూ. 250 చొప్పున వసూలు చేస్తారు. బస్సు, లేదా ట్రక్కు (2 యాక్సిల్) వాహనాలకు పంతంగిలో ఒకవైపునకు రూ. 265, ఇరువైపులకు రూ. 395, కొర్లపహాడ్‌లో రూ. 410, రూ. 615, చిల్లకల్లు టోల్‌ప్లాజాలో రూ. 350, రూ. 520 వసూలు చేస్తారు. వాణిజ్య రవాణా వాహనాల(3 యాక్సిల్)కు పంతంగిలో ఒకవైపునకు రూ. 290, ఇరువైపులా అయితే రూ. 435, కొర్లపహాడ్‌లో వరుసగా రూ. 450, రూ. 675, చిల్లకల్లులో రూ. 380, రూ. 570 వసూలు చేస్తారు.

# 'రాజీవ్ యువ వికాసం పథకం' దరఖాస్తుల గడువు పొడిగింపు

తెలంగాణ ప్రభుత్వం నిరుద్యోగులకు శుభవార్త తెలిపింది. ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'రాజీవ్ యువ వికాసం' పథకం దరఖాస్తు గడువును పొడిగించింది. గతంలో ఏప్రిల్ 5వ తేదీ వరకు ఉన్న గడువును ఏప్రిల్ 14 వరకు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ పథకం అమలు తీరుపై ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో మాట్లాడారు. పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్సులో మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, పలువురు కలెక్టర్లు పాల్గొన్నారు. రాజీవ్ యువ వికాసం పథకం కింద లబ్ధిదారులకు ప్రయోజనం చేకూర్చేందుకు ప్రభుత్వం యూనిట్ల విలువ ఆధారంగా రుణాలను మూడు కేటగిరీలుగా విభజించింది. కేటగిరీ–1 కింద రూ. 1 లక్ష, కేటగిరీ–2 కింద రూ. 2 లక్షలు, కేటగిరీ–3 కింద రూ. 3 లక్షల రుణాలను అందజేయనుండగా, వరుసగా 80 శాతం, 70 శాతం, 60 శాతం రాయితీ లభిస్తుంది.

# అటు పుతిన్ కు, ఇటు జెలెన్ స్కీకి... ఇద్దరికీ వార్నింగ్ ఇచ్చిన ట్రంప్

నుంచి వైదొలగాలని చూస్తే కష్టాలు తప్పవని హెచ్చరించారు. ట్రంప్ వ్యాఖ్యలపై రష్యా అధ్యక్ష భవనం ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ స్పందిస్తూ, ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికే ప్రయత్నాలు ఒక సుదీర్ఘ ప్రక్రియ అని అభివర్ణించారు. ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై నేరుగా స్పందించకుండానే, అమెరికా అధ్యక్షుడితో చర్చించడానికి పుతిన్ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటారని ఆయన స్పష్టం చేశారు. "ఉక్రెయిన్ విషయంలో కొన్ని ఆలోచనలు కార్యరూపం దాల్చుతున్నాయి. కానీ, ప్రకటన చేసేంతగా ఏమీ జరగలేదు. ఈ సమస్య చాలా సంక్లిష్టమైనది, కాబట్టి ఇది చాలా కాలం పట్టే ప్రక్రియ" అని పెస్కోవ్ పేర్కొన్నారు. అమెరికాతో చర్చల విషయంలో పుతిన్ ఎప్పుడూ అందుబాటులో ఉంటారని, ట్రంప్‌తో మాట్లాడేందుకు ఆయన సిద్ధంగా ఉన్నారని ఆయన నొక్కి చెప్పారు.

# పశ్చిమ హైదరాబాద్ ఢిల్లీలా కాలుష్య ప్రాంతంగా మారే ప్రమాదముంది: హెచ్‌సీయూపై కేటీఆర్

రూ. 30 వేల కోట్లు సంపాదించాలని కాంగ్రెస్ పార్టీ నేతలు చూస్తున్నారని ఆయన ఆరోపించారు. ఆ భూములను విక్రయించడానికి వారికి ఏం హక్కు ఉందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈరోజు ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఫ్యూచర్ సిటీ కోసం 45 వేల ఎకరాలను సిద్ధం చేస్తున్నప్పుడు, ఈ 400 ఎకరాలు ఎందుకని నిలదీశారు. హైకోర్టులో పిటిషన్ విచారణకు రాకముందే భూమిని చదును చేస్తున్నారని ఆరోపించారు. కోర్టుకు వరుసగా నాలుగు రోజులు సెలవులు రావడంతో ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే భూములను చదును చేస్తోందని మండిపడ్డారు. వందల సంఖ్యలో పోలీసులను మోహరించి, అడ్డుకునే వారిని కొడుతూ, మహిళల పట్ల దుశ్శాసన పర్వాన్ని తలపిస్తూ భూమిని చదును చేస్తున్నారని ఆరోపించారు.

## హెచ్ సీయూ భూముల వేలాన్ని వెంటనే నిలిపి వేయాలి

### - భూముల అమ్మకం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి - బిఆరెస్ నేత రవీందర్ యాదవ్



శేరిలింగంపల్లి వార్త మిర్రర్ :తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం తీరుపై భారాస సీనియర్ నేత రవీందర్ యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూములను అమ్మకానికి పెట్టేందుకు కుట్రలు పన్నుతుండటం సరైంధి కాదని,. హెచ్ సీయూ భూములను అమ్మాలని చూడటం అన్యాయమని ధ్వజమెత్తారు. యూనివర్సిటీ భూములను అక్రమంగా అమ్మి సొమ్ము చేసుకోవాలనుకోవడం దారుణమనీ, ప్రభుత్వ నిర్ణయంతో హెచ్ సీయూ యూనివర్సిటీ ప్రాంతంలో జీవ వైవిధ్యాన్ని కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. 400 ఎకరాల భూములను వేలం వేయాలని ప్రక్రియను వెంటనే నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీ పరిధిలోని పచ్చని చెట్లను నరికివేయడానికి ప్రభుత్వం పాల్పడటం కరెక్ట్ కాదన్నారు. ఆదివారం వర్సిటీ ప్రాగణంలో జేసీబీలతో చెట్లను కూల్చివేసి నేలను చదును చేసేందుకు పాల్పడ్డారని, అడ్డు వచ్చిన విద్యార్థులపై ఇష్టారాజ్యంగా దాడులు చేయడంపై రవీందర్ యాదవ్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. విద్యార్థులతో ఆటలు ఆడోద్దని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పోలీసుల ద్వారా భయ పెట్టాలని చూస్తున్నారని మండిపడ్డారు. ప్రతిష్టాత్మకమైన సెంట్రల్ యూనివర్సిటీని కాంగ్రెస్ ప్రభుత్వం భ్రష్టు పట్టించాలనే కుట్రలు పన్నుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 400 ఎకరాలను వేలం వేయాలనుకునే నిర్ణయాన్ని వెంటనే నిలిపివేయాలని, లేదంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని రవీందర్ యాదవ్ హెచ్చరించారు.

## గ్రూప్1 సత్తా చాటిన ధరవత్ సభిత నాయక్

### భర్త కు అత్తమామలకు కృతజ్ఞతలు తెలిపిన- ధారావత్ సబిత నాయక్



యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి గణేష్ సాగర్ యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం లోని రామోజీ నాయక్ తండకు చెందిన టీచర్ రమేష్ నాయక్ గారి 2వ కోడలు, ధరావత్ సబితకు గ్రూప్ 1లో 303 ర్యాంకు సాధించడం జరిగింది, చక్రిపురం మధుర నగర్ కు చెందిన హరినాయక్, శాంతాల మూడో కూతురు ధరావత్ సబిత భర్త బాణోత్ సంతోష్ కుమార్, తన తండ్రి కి 7 గురు కూతుళ్లు, ఒక్క కొడుకు, తన పిల్లలకు ఉజ్వల భవిష్యత్తు కోసం చదువునే ఒక ఆయుధంగా ఇచ్చినటువంటి తల్లిదండ్రులకు, సహకరించిన అత్తమామలకు కృతజ్ఞతలు తెలియజేశారు,అభినందించిన లంబాడి హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు భూక్య సంతోష్ నాయక్ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదరికంలో పుట్టిన సబిత ఇంత విజయం సాధించడానికి గల కారణం, పట్టుదల, కృషి ఒక ఉన్నత లక్ష్యాన్ని పెట్టుకున్నది కాబట్టి, ఈరోజు ఈ స్థాయిలో ర్యాంకు సాధించడం జరిగింది, సమాజంలోని ఆడబిడ్డలు సబిత ను ఆదర్శంగా తీసుకొని ప్రతి తండాలో,ప్రతి గ్రామాల్లో ఒక ఐఏ ఎస్ మరియూ ఐపీఎస్ గా విజయాలు సాధించాలని తెలియజేశారు, దానికి సవిదని ఆదర్శంగా తీసుకోవాలన్నారు చదువుకునే బలమైన కోరిక ఉంటే పేదరికం అడ్డురాదు, పేదోడి తాల రాత మార్చేది కేవలం విద్య ఒక్కటే, విద్య ఒకటే నిన్ను సమాజంలో గౌరవం ఇస్తుంది, అత్యున్నత స్థానాన్ని చేర్చుతుంది అని కొనియాడారు,



## దేవుడి దర్శనానికి వచ్చిన మహిళపై లైంగిక దాడులు

### - కామాంధులని కఠినంగా శిక్షించాలి.. రాజేందర్ గౌడ్

కల్వకుర్తి ఊర్కొండ మార్చ్ 31 వార్త మిర్రర్ ప్రతినిధి:–ఊర్కొండ మండలం ఊర్కొండ పేట హనుమాన్ దేవాలయనికి దర్శనానికి వచ్చినటువంటి యువతి పై శనివారం రాత్రి కొందరు యువకులు లైంగిక దాడికి పాల్పడిన ఘటన దురదృష్టకరం ఇలాంటి అఘాయిత్యాలకు పాల్పడిన వారిని వెంటనే కఠినంగా శిక్షించాలని బిజెపి ఊర్కొండ మండల అధ్యక్షులు కోరారు. అదేవిధంగా ఈ సంఘటన పై పార్టీ నాయకులు మాట్లాడుతూ బిజెపి పార్టీ పూర్తిగా ఇలాంటి సంఘటనలు ఖండిస్తుందని భారతీయ జనతా పార్టీ విచారణ వ్యక్తం చేస్తుంది.ఈ అమానవీయ సంఘటనకు బాధ్యులను గుర్తించి నిష్పక్షపాతంగా ఎంతటి వారినైనా విచారణ చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని భారతీయ జనతా పార్టీ డిమాండ్ చేస్తుంది.ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీస్ శాఖ బందోబస్తును ఏర్పాటు చేసి నిఘా కఠిన తరం చేయాల్సిందిగా భారతీయ జనతా పార్టీ కోరుచున్నదిఆలయ పవిత్రతను కాపాడాలని ఆలయకమిటీ మౌలిక వసతులను కల్పించాలని వచ్చే భక్తులకు తగిన రక్షణ మరియు సదుపాయాలను కల్పించాలనిఅడుగడుగునా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని బాధితురాలికి తగిన న్యాయం చేయాలనిఈ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.ఈ సమావేశంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ లక్ష్మారెడ్డి,మండల అధ్యక్షులు కే రాజేందర్ గౌడ్,జర్నల్ సెక్రెటరీలు పరశురాం బ్రహ్మచారి,ఉపాధ్యక్షులు శివ, మరియు కొమ్ము శ్రీను,లక్ష్మణ్ గౌడ్,మల్లేష్,కిట్టు సురేష్, తదితరులు పాల్గొన్నారు.



## స్థానిక సమరానికి సై

### - కడ్తాల్ మండలానికి హరీష్ రావు రాక

### - సభా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న నాయకులు

కల్వకుర్తి మార్చ్ 31 వార్త మిర్రర్ ప్రతినిధి:– ఏప్రిల్ 2 న కడ్తాల్ మండలానికి మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు రానున్న సందర్భంలో సోమవారం సరికొండ గ్రామపంచాయతీ పరిధిలోని బోయిన్ గుట్ట తండాలో సభా స్థలాన్ని మండల నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటిసి దశరథ్ నాయక్ మాట్లాడుతూ హరీష్ రావు రాకను ప్రతిష్టాత్మకంగా తీసుకొని నియోజకవర్గం నుండి ప్రతి కార్యకర్త ముందుకు వచ్చి సభను విజయవంతం చేయాలని నాయకులకు సూచించారు. రానున్న స్థానిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పరమేష్ పి ఎస్ ఎస్ చైర్మన్ వెంకటేష్ మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్ మాజీ జెడ్పిటిసి విజితా రెడ్డి మాజీ సర్పంచులు నరసింహ గౌడ్ యాదయ్య రవీందర్ రెడ్డి హరిచంద్ నాయక్ భాగ్యమ్మ జంగయ్య మాజీ ఎంపిటిసిలు లచ్చి రామ్ నాయక్ ప్రియా రమేష్ రైతు కోఆర్డినేటర్ వీరయ్య నాయకులు రామకృష్ణ జంగయ్య శ్రీను అంజి సోమ్లా బాబూజీ రాజేష్ వినోద్ గోపాల్ వెంకటయ్య రాజు పర్వతాలు నాయకులు పాల్గొన్నారు.

# ధర్జాగా చెరువు స్థలం కబ్జా

### - కళ్లు మూసుకున్న అధికారులు

### లంచాలు పుచ్చుకొని మౌనం పాటిస్తున్న అధికారులనీ గ్రామస్తుల ఆరోపణ

### - వరుస సెలవులను ఆసరాగా చేసుకొని నిర్మాణం పూర్తి చేసి రంగులు వేసుకొన్న కబ్జాదారులు





శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : చెరువులు, కుంటలను కాపాడుతామని ఎంతో అర్బాట%శీ%గా ప్రారంభించిన హైడ్రాకు తాజాగా జరుగుతున్న కబ్జాల విషయం తెలియయడం లేదు అంటే ఎవరు నమ్మరు. ఎందుకంటే ప్రభుత్వం లో పనిచేస్తున్న అధికారులకు రాష్టం లోని అన్ని ప్రాంతాలు, వ్యవస్థలు, వివిధ శాఖలకు సంబందించిన వివరాలు అధికారుల వద్ద ఉంటాయి. కానీ ఎవరైనా అడిగితే మాత్రం తెలియదు, అవునా చూస్తాము అంటారు.శేరిలింగంపల్లి మండల పరిధిలోనీ మక్త మహబూబ్ పేట్ లోని పెద్ద కుంట చెరువు 121 సర్వే నెంబర్ లో గల చెరువు స్థలం లో దాదాపు 300 గజాల కు పైగా ఉన్న స్థలాన్ని కబ్జా చేసి, మక్త గ్రామానికి చెందిన మరో నాయకున్ని అడ్డం పెట్టుకొని పెద్ద రేకుల రూమ్ కట్టి, చుట్టూ ప్రహరీ గోడ నిర్మించాడు. ఎక్కడ కబ్జా జరిగినా వెంటనే చర్యలు తీసుకొనే అధికారులను డబ్బు కట్టలతో చర్యలు తీసుకోకుండా ఉన్నారు. కబ్జా దారులు నాయకుల అండదండలతో అధికారులు చర్యలు తీసుకోకుండా అడ్డుకట్ట వేసి యదేచ్చగా కబ్జా స్థలం లో నిర్మాణం పూర్తి చేశారు. వరుస సెలవులు రావడం తో కూడా కబ్జా దారులకు కల్సివచ్చింది. వెంట వెంటనే నిర్మాణం పూర్తి చేసి రంగులు వేసి పాత నిర్మాణాల్లో కలిపేసే ప్రయత్నం చేసి అధికారుల కళ్ళకు గంతలు కట్టారు.ఎక్కడ సుందరి కరణ ?నగరం లోని చెరువులను సుందరీకరిస్తామని చెప్పి ఇటీవల ఓ సంస్థకు సుందరీ కరణ పనులు అప్పగించారు. ఇదే అధనుగా భావించిన కబ్జా దారులు తమ అక్రమ నిర్మాణాన్ని సుందరీకారణ పేరుతో సు%శీ%దరికరించుకున్నారు. సుందరి కరణ పేరుతో కబ్జాలను ప్రోత్సహిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ విషయం ఇరిగేషన్, టౌన్ ప్లానింగ్ అధికారులకు తెలుసనీ అందరిని డబ్బులతో మ్యానేజ్ చేసి, అందరికి వాటాలు ఇచ్చి కబ్జా చేశారనీ, ఈ విషయం లో అన్ని శాఖల అధికారులు తమకే అనుకూలంగా ఉన్నారని సదరు కబ్జా దారులు చెప్పుకోవడంలో అర్థం ఏంటో వారికే తెలియాలని పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు కల్సి కబ్జా స్థలాన్ని కాపాడాలని పర్యావరణ వేత్తలు కోరుతున్నారు.పత్తా లేని హైడ్రా... చెరువులను కుంటలను కాపాడుతామని కొన్నాళ్ళు హడావిడి చేసి ఇప్పుడు సైలెంట్ అయ్యారు. నీటి వనరులు పెంచడం కోసం ఏర్పాటైన హైడ్రా ఎక్కడా అని ఇరిగేషన్ అధికారులు చెరువును కాపాడడం కోసం ఎలాంటి చర్యలు తీసుకోక పోవడం లో ఆంతర్యం ఏమిటనీ గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. అధికారులకు తెలిసే జరుగుతుందనీ, అందుకే హైడ్రా అధికారులు పత్తా లేకుండా పోయారనీ వారు ఆరోపిస్తున్నారు.కాపాడాల్సిన అధికారులే చెరువులు, కుంటలను కబ్జా దారుల నుండి కాపాడాల్సింది, పోయి ఏమి తెలియనట్లు చూసి చూడనట్లు వదిలేశారు. చెరువును సుందరికరించాల్సింది పోయి కబ్జా దారులను వదిలేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి కబ్జా స్థలాన్ని కాపాడి కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలనీ పర్యావరణ వేత్తలు కోరుతున్నారు.

## రిజర్వేషన్లు ఎవరు ఇచ్చే భిక్ష కాదు అది బీసీల సామాజిక హక్కు-జాజుల శ్రీనివాస్ గౌడ్


### బీసీలమంతా ఏకమై మన హక్కులను సాధించుకుందాం-ఉప్పరి శేఖర్ సగర






యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి గణేష్ సాగర్పార్లమెంట్ సమావేశాల్లో బీసీ బిల్లును ఆమోదించాలని కోరుతూ ఏప్రిల్ 2 న తలపెట్టిన బీసీల పోరు గర్జనకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్, సగర సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఉప్పరి శేఖర్ సగర ఆధ్వర్యంలో ఢిల్లీలో జంతర్ మంతర్ వేదికపై బీసీల పోరు గర్జనకు తెలంగాణ సగర సైన్యం కదిలింది. ఈ సందర్భంగా ఉప్పరి శేఖర్ సగర మాట్లాడుతూ చరిత్రలో ఎన్నడు దేశంలోని 29 రాష్ట్రాల నుంచి బీసీలు భారీగా తరలివస్తారని, ఢిల్లీని ముట్టడించి బీసీల సత్తా చాటాలని సగరులు భారీ సంఖ్యలో ఢిల్లీ మహాధర్నాకు బయలుదేరుతున్నామని అన్నారు. దేశవ్యాప్తంగా బీసీ కులగన్న చేపట్టాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు పెంచేందుకు పోరాటం చేయాల్సిందే అన్నారు.కేంద్ర ప్రభుత్వం బీసీలకు అన్యాయం చేస్తే బీసీల సత్తా చూపించాల్సిన అవసరం వస్తుందని హెచ్చరించారు. జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ పోరు గర్జన కార్యక్రమానికి పార్టీలకు అతీతంగా బీసీలమంతా పార్టీలకు అతీతంగా బీసీలమంత తరలి రావాలని అన్నారు. రిజర్వేషన్లు ఎవరు ఇచ్చే భిక్ష కాదని అది బీసీల సామాజిక హక్కు అనే అన్నారు. బీసీలమంతా ఏకమై మన హక్కులను సాధించుకుందాం అన్నారు. తెలంగాణలోని అన్ని జిల్లాలలో బీసీలు ఐక్యంగా పాల్గొని బీసీల పోరుగర్జనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు

## కల్వకుర్తి లో షార్ట్ సర్క్యూట్తో దుకాణలు దగ్ధం



కల్వకుర్తి మార్చ్ 31 వార్త మిర్రర్ ప్రతినిధి:– కల్వకుర్తి పట్టణంలోని రెండు దుకాణాల్లో షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు వ్యాప్తి దుకాణాలు కాలిపోయాయి. దుకాణ దారుల ఇచ్చిన సమాచారం మేరకు.. వివరాల్లోకి వెళితే పట్టణంలోని బస్ స్టాండ్ వెనకాల గల సుభాష్ నగర్ కాలనీలో అప్నా బజార్ 30 ఏండ్లకు పైగా అన్నదమ్ములు ఇరువురు 2 దుకాణాల్లో ఒకరు మారం రాఘవేందర్,గానుగ నూనె మిషన్ కిరాణా సామాగ్రి, మరొకరు మారం రాకేష్ కుమార్,కంప్యూటర్ సేల్స్ సర్వీస్ వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. సోమవారం తెల్లవారుజామున 3 గం. ప్రాంతంలో క్రింద దుకాణం నుండి షాట్ సర్కుట్ జరిగి మంటలు చెలరేగి పై దుకాణం వరకు వ్యాపించాయి.అధిక స్థాయిలో మంటలు చెలరేగడంతో కుటుంబీకులు ఫైర్ స్టేషన్ కు సమాచారం అందించగా హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది 40 నిమిషాలకు పైగా శ్రమించి మంటలను ఆర్పారు. అప్పటికే రూ.25 లక్షలకు పైగా సామాగ్రి, కంప్యూటర్ పరికరాలు అగ్నికి ఆహుతయ్యాయి. కొన్ని రోజుల క్రితం దుకాణ ఇన్సూరెన్స్ కాలపరిమితి ముగిసింది. ఏం చేయలేని స్థితిలో దుకాణ యజమానులు లబో దిబో మంటున్నారు. ఇరువురి కుటుంబాలు ఈ దుకాణాల పైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఆ బ్రతుకు దెరువు కూడా కాలి బూడిద అవ్వడం తో అయోమయంలో ఉన్నారు.



## మైనార్టీ నాయకులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన ఆలకుంట హరి

సికింద్రాబాద్, వార్తా మిర్రర్ మార్చి 31 : రంజాన్ పండుగను పురస్కరించుకుని తార్నాక డివిజన్ లోని బీఆర్ఎస్ మైనార్టీలను బీఆర్ఎస్ గ్రేటర్ హైదరాబాద్ యూత్ అధ్యక్షులు ఆలకుంట హరి కలిసి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మైనార్టీలను ఆలింగనం చేసుకొని రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ముస్లింలకు కేసీఆర్ చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. హిందూ,ముస్లిం అన్నదమ్ముల వలె ఉండాలని ఆలకుంట హరి కోరారు. ఈ కార్యక్రమంలో ఖాజా, యాకూబ్, నిజాం, ఇమ్రాన్, ప్రశాంత్, లంబడి నరసింహ, సత్యనారాయణ, వీరేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.





## సంస్కృతి సాంప్రదాయాలను రక్షించడం ప్రతి గ్రామంలో ఆర్ఎస్ఎస్ శాఖలు నిర్వహించాలి - జిల్లా ప్రముక్ మోటే సుధాకర్

### సనాతన ధర్మాన్ని కాపాడుకోవాలి- శ్రీ శ్రీ శంకరానంద స్వామి

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి గణేష్ సాగర్

సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని జైహింద్ ఫంక్షన్ హాల్ లో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ ఎస్ ) మహారాణా ప్రతాప్ సింగ్ శాఖ వార్షికోత్సవం, ఉగాది ఉత్సవం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చినటువంటి శ్రీ శ్రీ శంకరానంద స్వామి మాట్లాడుతూ సనాతన ధర్మం యొక్క గొప్పతనం హిందూ పండుగలు విశిష్టత గురించి వివరించడం జరిగింది. ముఖ్య వక్తగా వచ్చినటువంటి మోటే సుధాకర్(యాదాద్రి భువనగిరి జిల్లా సహ శారీరక్ ప్రముక్) మాట్లాడుతూ రాష్ట్రీయ స్వయం సేవక్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ప్రతి ఒక్క గ్రామంలో శాఖ ప్రారంభించాలి శరీరాన్ని కాపాడుకోవడం , దేశభక్తిని పెంచుకోవాలి. భారత దేశ సంస్కృతి సాంప్రదాయాలను రక్షించడం కోసం ప్రతి ఒక్కరూ శాఖలో ఒక గంట సమయం కేటాయించాలని సూచించడం జరిగింది.ఈ కార్యక్రమంలో నారాయణపురం మండల ప్రజలు ,స్వయంసేవకులు, పూర్వ స్వయం సేవకులు పాల్గొన్నారు.



## సికింద్రాబాద్ తెదేపా విజయోత్సవ సమావేశం

సికింద్రాబాద్, వార్త మిర్రర్ మార్చి 31.... శనివారం జరిగిన తెలుగుదేశం పార్టీ 43 వ ఆవిర్భావ దినోత్సవం విజయోత్సవ సమావేశం సోమవారం ఉదయం సికింద్రాబాద్ తెదేపా ఇంచార్జ్ వల్లారపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో బౌద్ధనగర్ లోని ఆయన నివాసంలో జరిగింది.ఈసందర్భంగా వల్లారపు శ్రీనివాస్ మాట్లాడుతూ మొన్న జరిగిన తెలుగుదేశం పార్టీ 43 వ ఆవిర్భావ దినోత్సవం విజయవంతం చేసిన ప్రతిఒక్కరికీ పేరుపేరునా కృత్ఞతలు తెలియజేసారు.తెలుగుదేశం పార్టీ ప్రజలకొరకు ప్రగతికొరకు తెలుగుగడ్డ అభివృద్ధి కొరకు పుట్టిన పార్టీ అని, అలాంటి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి దివంగత నందమూరి తారక రామారావు తనయులు నందమూరి రామకృష్ణ ముఖ్య అతిథిగా రావడం సికింద్రాబాద్ నియోజకవర్గం అదృష్టం అన్నారు.తెలుగుదేశం పార్టీకి సికింద్రాబాద్ నియోజకవర్గంలో పూర్వ వైభవం తీసుకురావడమే లక్ష్యంగా పనిచేయాలని పార్టీ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో తెదేపా సీనియర్ నాయకులు పరిటాల విజయ్ కుమార్, జి వి క్రిష్ణ, వెంకటస్వామి, శేషిరేఖ, మురళి క్రిష్ణ, చంద్రమోహన్, నాయుడు తదితరులు పాల్గొన్నారు.



## లాలాపేట్ లోని శ్రీ లలితా పీఠం ఆధ్వర్యంలో ఘనంగా శ్రీ లలితా దేవి నవరాత్రి ఉత్సవాలు

సికింద్రాబాద్, వార్త మిర్రర్ మార్చి 31... లాలాపేట్ ప్రధాన రోడ్డులో ఉన్న మంజరి హాస్పిటల్స్ ప్రక్కనే ఉన్న శ్రీ లలితా పీఠం ఆధ్వర్యంలో మార్చి 29 నుంచి ఏప్రిల్ ఆరవ తేదీ వరకు శ్రీ లలితా దేవి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుపుతున్నారు అందులో భాగంగా శ్రీ మహా లలిత యజ్ఞం, అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలు ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు.



## రంజాన్ పండుగ పర్వదిన శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు

మిర్యాలగూడ, మార్చి 31:-( వార్త మిర్రర్)రంజాన్ పండుగ పర్వదిన సందర్భంగా శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్, ఎమ్మెల్సీ కె.శంకర్ నాయక్ మిర్యాలగూడ పట్టణం బంగారుగడ్డలోని ఈద్గా అవంతిపురం గ్రామ శివారులోనీ ఈద్గా వద్ద ఈద్ ఉల్ ఫితర్ పండుగలో బాగంగా ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేసి అనంతరం ముస్లింలతో కలసి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. పలువురు ముస్లింలను ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలిపారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్రెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి చిలుకూరు బాలు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పొదిల శ్రీనివాస్, తలకొప్పుల సైదులు, నాయకులు చిరుమరి కృష్ణయ్య, సయ్యద్ మహబూబ్ ఆలీ, మాజీ కౌన్సిలర్లు ఎండి.జాని, జలంధర్ రెడ్డి, జి.జానకిరామ్ రెడ్డి, ఎండి.మోయిజ్, ఎండి ఆరిఫ్, షేక్ అబ్దుల్లా, ఉబ్బపల్లి కాశయ్య, కార్యకర్తలు, బిఎల్ఆర్ బ్రదర్స్ పాల్గొన్నారు.



## తార్నాక లో ఘనంగా వంజరికుల మహిళా సదస్సు

సికింద్రాబాద్, వార్త మిర్రర్ మార్చి 31: తార్నాకలోని వంజరి సంఘం రాష్ట్ర కార్యాలయంలో వంజరికుల మహిళా సదస్సు సోమవారం ఘనంగా నిర్వహించారు. వందలాది మంది మహిళలు ఈ సదస్సుకు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భారతీయం సత్యవాణి పాల్గొని మాట్లాడుతూ మహిళలు ఎక్కడ గౌరవించబడుతారో అక్కడ అభివృద్ధి, సంక్షేమం ఉంటుందన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు, సంస్కృతి సంప్రదాయాలపై తెలిసేలా పెంచాలని సూచించారు. మహిళలు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణిచేందుకు కృషి చేయాలన్నారు. వంజరి సంఘం వారు సమజానికి చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా వివిద రంగాల్లో రాణిస్తున్న మహిళలను సంఘం వారు ఘనంగా సత్కరించారు. పిల్లలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, భరతనాట్యం చేసి అలరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వంజరి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కాలేరు నరేందర్, ప్రధాన కార్యదర్శి కందారి వెంకటేషం, కోషాధికారి కాలేరు అమరేందర్, ముఖ్యసలహాదారులు సాల్వేరు ముత్తయ్య, కరిపే ప్రవీణ్, మహిళా అధ్యక్షురాలు గాయరి శోభ, కార్యవర్గ సభ్యురాలు ఆరెగీత, సాల్వేరు దేవిక, దాత్రిక సాయిరజని, బెండె అనురాధ, బొగ్గుల సునితతో పాటు వలువురు పాల్గొన్నారు.



## బిజెపి ఫ్లెక్సీలను చింపివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని లాలాగూడ పీఎస్ లో ఫిర్యాదు



సికింద్రాబాద్ ,వార్త మిర్రర్ మార్చి 31 ... ఉగాది పండుగ, శ్రీరామ నవమి పురస్కరించుకొని లాలాపేట్ రామ్ థియేటర్ ఎదురుగా, తార్నాక చౌరస్తాలో బిజెపి నాయకులు మేకల సారంగపాణి ఏర్పాటు చేసిన భారీ ఫ్లెక్సీలను గుర్తు తెలియని అగంతకులు చింపివేశారు. దీంతో తార్నాక బిజెపి డివిజన్ అధ్యక్షులు ఉపేందర్ యాదవ్ నాయకులు కార్యకర్తలతో కలిసి లాలాగూడ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. తరచూ మేకల సారంగపాణి ఫ్లెక్సీలు తార్నాక డివిజన్లోనే తొలగించడం పై ఈ ప్రాంతంలో బిజెపి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉపేందర్ యాదవ్ వెంట వెంకటేష్ గౌడ్, పొచయ్య యాదవ్, కరుణాకర్, రాము వర్మ, రాజు జైన్, అనూష తదితరులు పాల్గొన్నారు.

## సేవా స్ఫూర్తి వంటి అత్యున్నత విలువలకు ప్రతీకగా రంజాన్::::::: ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ మార్చి 31 వార్త మిర్రర్ :పవిత్ర రంజాన్ పండగను పురస్కరించుకొని ముస్లిం సోదర సోదరీమణులందరికీ ఎమ్మెల్యే బాలునాయక్ శుభాకాంక్షలు తెలియజేశారు. సోమవారంనాడు దేవరకొండ పట్టణంలోనీ మహమ్మద్ అబ్దుల్ బాషీద్ మత పెద్ద కలిసి వారికి వారి కుటుంబ సభ్యులకు రంజాన్ శుభాకాంక్షలు ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలనాగ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా దేవరకొండ పట్టణంలో మత పెద్దలను కలిసి వారికి వారి కుటుంబ సభ్యులకు రంజాన్ మాస శుభాకాంక్షలు వస్తుందని వారు అన్నారు.రంజాన్ మాసం, ఉపవాసం, ప్రార్థన, దానం, సేవా స్ఫూర్తి వంటి అత్యున్నత విలువలకు ప్రతీకగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.త్యాగం, కరుణ, శాంతి, ప్రేమ, సామరస్యాన్ని చాటే రంజాన్ పండుగను క్రమశిక్షణతో, ప్రశాంతంగా జరుపుకోవాలని ఆయన ముస్లీంలకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ముస్లిం సమాజ అభివృద్ధికి కట్టుబడి ఉందని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు నల్గొండ పార్లమెంట్ కోఆర్డినేటర్ సిరాజ్ ఖాన్,మున్సిపల్ మాజీ చైర్మన్ ఆలంపల్లి నర్సింహా, వడ్త్య దేవేందర్ నాయక్,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ముక్కామల్ల వెంకటయ్య గౌడ్, పీఏసీఎస్ చైర్మన్లు డాక్టర్ వేణుధర్ రెడ్డి,శ్రీశైలం యాదవ్, సిపిఐ రాష్ట్ర నాయకులు పల్లా నర్సింహా రెడ్డి,పట్టణ మాజీ సర్పంచ్ పున్న వేంకటేశ్వర్లు,పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు యూనుస్,మాజీ ఎంపీపీలు జాని యాదవ్,



ఏడ్పుల గోవింద్ యాదవ్,బిక్కు నాయక్,సీనియర్ నాయకులు తిపర్తి రూక్మా రెడ్డి, హన్మంతు వెంకటేష్ గౌడ్, యూత్ కాంగ్రెస్ నియోజక వర్గ అధ్యక్షులు కిన్నెర హరికృష్ణ, మాజీ ఎంపీటీసీ వెంకటయ్య,మాజీ కౌన్సిలర్లు భూదేవి సైదులు, మహమ్మద్ అబ్దుల్ ఇయన్ మహమ్మద్ అబ్దుల్ బారీ మహమ్మద్ అబ్దుల్ బాక్రీయూత్ కాంగ్రెస్ నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

# రంజాన్ మాసం మతసామరస్యానికి ప్రతీక

### దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్

దేవరకొండ మార్చి 31 వార్త మిర్రర్ :రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం నాడు దేవరకొండ మున్సిపల్ వైస్ చైర్మన్ రహత్ ఆలీ నీ వారి స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్.ఈ సందర్బంగా ఎమ్మెల్యే బాలునాయక్ మాట్లాడుతూ పవిత్రమైన రంజాన్ మాసంలో చిన్నపిల్లల నుంచి మొదలుకొని వృద్ధుల వరకు కఠోర నియమాలతో ఉపవాస దీక్షలు చేయడం గొప్ప విషయమన్నారు..రంజాన్ మాసం మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు.. ఆ అల్లా ఆశీస్సులతో ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు..మత సామ్రాస్యతను పెంపొందించే పండుగ రంజాన్ అని, మైనార్టీ సంక్షేమానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.రంజాన్ పర్వదినాన్ని ముస్లిం సోదరులు అందరూ అద్భుతంగా జరుపుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు నల్గొండ పార్లమెంట్ కోఆర్డినేటర్ సిరాజ్ ఖాన్,మున్సిపల్ మాజీ చైర్మన్ ఆలంపల్లి నర్సింహా, వడ్త్య దేవేందర్ నాయక్,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ముక్కామల్ల వెంకటయ్య గౌడ్, పీఏసీఎస్ చైర్మన్లు డాక్టర్ వేణుధర్ రెడ్డి,శ్రీశైలం యాదవ్, సిపిఐ రాష్ట్ర నాయకులు పల్లా నర్సింహా రెడ్డి,పట్టణ మాజీ సర్పంచ్ పున్న వేంకటేశ్వర్లు,పట్టణ కాంగ్రెస్



పార్టీ అధ్యక్షులు యూనుస్,మాజీ ఎంపీపీలు జాని యాదవ్, ఏడ్పుల గోవింద్ యాదవ్,బిక్కు నాయక్,సీనియర్ నాయకులు తిపర్తి రూక్మా రెడ్డి, హన్మంతు వెంకటేష్ గౌడ్, యూత్ కాంగ్రెస్ నియోజక వర్గ అధ్యక్షులు కిన్నెర హరికృష్ణ, మాజీ ఎంపీటీసీ వెంకటయ్య,మాజీ కౌన్సిలర్లు భూదేవి సైదులు, రైస్, తౌఫీక్,యూత్ కాంగ్రెస్ నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

## పాపం అంటే ఏమిటి?



వార్త మిర్రర్ రాయికల్ (తిరుమల శంకర్) మార్చి 31అనాది కాలం నుంచి వేరువేరు నాగరికతలు, సంస్కృతులు విభిన్న కర్మలకు నిర్వచనాలు ఇచ్చాయి. కొన్నిటిని పాపాలుగా పేర్కొన్నాయి. ఈ జాబితా కాలక్రమేణా మారుతూ వచ్చింది. ఆధునిక యుగంలో దేశాలు తమవైన శిక్షాస్మృతిని కలిగి ఉంటాయి. ఇవి కొన్ని చర్యలను నేరాలుగా లేదా పాపాలుగా నిర్వచిస్తాయి. ఆ పనులకు పాల్పడినవారిని శిక్షిస్తాయి. అటువంటి నిషేధితమైన కర్మలను మనం చేసినప్పుడు అపరాధభావం, పశ్చాత్తాపం, అవమానభారంతో మనల్ని మనం శిక్షించుకుంటూ ఉంటాం. 'వికర్మ' లేదా 'నిషిద్ధ కర్మ', 'పాపం' అంటే ఏమిటి? అనే ప్రశ్న చాలా జటిలమైనది. అర్జునుడు కూడా ఈ సందిగ్ధంలో పడ్డాడు. యుద్ధంలో తన బంధువులను చంపడం ద్వారా 'పాపం మాత్రమే కలుగుతుందని భావించాడు. ఈ సందర్భంలో శ్రీకృష్ణుడు “అంతఃకరణను, శరీర ఇంద్రియాలను జయించినవాడు, సమస్త భోగ సామగ్రిని పరిత్యజించినవాడు, ఆశారహితుడు అయిన యోగి కేవలం శరీర కర్మలను మాత్రమే ఆచరిస్తూ ఉంటాడు. అతనికి పాపాలు అంటవు” అని చెప్పాడు. “జయాపజయాలను, లాభనష్టాలను, సుఖఃదుఖాలను సమానంగా భావించి, యుద్ధానికి సిద్ధపడు. అప్పుడు నీకు పాపాలు అంటనే అంటవు” అని అంతకుముందు స్పష్టం చేశాడు. 'ఏది పాపం?' అనే ఆలోచన చేసేటప్పుడు అర్థం చేసుకోవలసిన సూక్ష్మమైన విషయం ఒకటి ఉంది. అది ఏమిటంటే... భౌతిక ప్రపంచంలో మనం చేసే కర్మల ఆధారంగా మనం దాన్ని అంచనా వేస్తాం. కానీ శ్రీకృష్ణుడి దృష్టిలో ఇది 'అంతర్గతమైన' విషయం. మనం ఏది చెబుతున్నాం, ఏది చేస్తున్నాం అనేది మన మానసిక స్థితి తాలూకు పరిణామం. అందుకనే మానసిక స్థాయిలో అవగాహన పొందడం అవసరమని శ్రీకృష్ణుడు చెబుతున్నాడు. ఇలాంటి ఆలోచనలు తాత్త్విక స్థాయిలో మనలో అనేక సందేహాలను లేవెనత్తుతుంది, కానీ అనుభవ స్థాయిలో మనకు స్పష్టత వస్తుంది. “ఏదైనా దొరికినప్పుడు... దాన్ని కోరుకోకపోయినా సరే, దానితో సంతుష్టి పడి, ద్వంద్వాతీతంగా ఉంటూ, అసూయ నుంచి విముక్తి పొంది, అన్నిటిపట్లా సమాన దృష్టి కలిగిన వ్యక్తి... కర్మలను చేసినా వాటి బంధాల్లో చిక్కుకోడు” అని శ్రీకృష్ణుడు పేర్కొన్నాడు. వాస్తవానికి ఈ వివరణను వివిధ సందర్భాల్లో ఎన్నో బోధనలు కలిగి ఉన్న భగవద్గీతకు సూక్ష్మరూపం అని చెప్పవచ్చు. ద్వంద్వాతీత స్థితిని పొందాలని, ప్రతిదాన్నీ విభజించే తత్త్వం ఉన్న మనస్సును కేవలం శరీర పోషణకు అవసరమైన ఆలోచనా చర్యలకు మాత్రమే ఉపయోగించాలని శ్రీకృష్ణుడు చెప్పాడు. తిరుమల శంకర్ రాయికల్ ప్రతినిధి



## వక్ఫ్ బిల్లుకు నిరసనగా నల్ల రిబ్బన్లు లతో ఈద్గాల వద్ద నమాజ్

మిర్యాలగూడ మార్చి 31:-( వార్త మిర్రర్) మిర్యాలగూడ మండలం, పట్టణంలోని ఈద్గాలలో ఈదుల్ ఫిత్ర్ (రంజాన్) నమాజ్ ఘనంగా నిర్వహించారు. ఒకవైపు సంతోషంగా ఈద్గాలకు తరలి వస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టనున్న వక్ఫ్ బిల్లుకు నిరసనగా నల్ల రిబ్బన్లు చేతికి కట్టుకుని నమాజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయా ఈద్గాలలో నమాజ్ చేయించిన ముఫ్తీ రియాజ్, ముఫ్తీ ఇమ్రాన్, మౌలానా ఎండి.వలియుల్లా, మౌలానా మగ్దూం, హాఫీజ్ అక్బర్ లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దురుద్దేశ్య పూర్వకంగా, వక్ఫ్ ఆస్తులన్నీ స్వాధీనం చేసుకోవాలని దురాలోచనను తిప్పి కొట్టేందుకు ఆలిండియా పర్సనల్ లా బోర్డు, జమైతే ఉలేమా యే హింద్ పిలుపు మేరకు నిరసనచేస్తున్నామని వారన్నారు. అదేవిధంగా జమైతే అవామ్ అధ్యక్షుడు ఎంఎ. సమీఖాద్రి మాట్లాడుతూ వక్ఫ్ బిల్లును కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని కోరారు.

## ఈద్గా ప్రార్థనల్లో పాల్గొన్న వారికి ఈద్ ముబారక్ తెలిపిన బిఆర్ఎస్ నాయకులు



మిర్యాలగూడ , మార్చి 31:- (వార్త మిర్రర్) ఈదుల్ ఫిత్ర్ (రంజాన్) వేడుకల్లో భాగంగా సోమవారం మిర్యాలగూడ పట్టణం బంగారుగడ్డలోని ఈద్గా, మిర్యాల గూడ మండలం అవంతిపురం గ్రామ శివారులోనీ ఈద్గాలో ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలకు బిఆర్ఎస్ నాయకులు, ఎన్బిఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు నల్లమోతు సిద్ధార్థ ఆధ్వర్యంలో శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మగ్దూం, మాజీ కౌన్సిలర్ ఎండి.ఇలియాస్, ఎండి. ఫయాజ్, హ్యూమన్ రైట్స్ డిఫెండర్ హమీద్ షేక్, పి.లక్ష్మీనారాయణలు పాల్గొన్నారు.



## విశ్వా వసు తెలుగు నూతన సంవత్సరం ఉగాది వేడుకలు

### గ్రామీణ కలల పరిరక్షణ సేవాసమితి ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీ నారాయణ యాక్షన్ గాన

### అధ్యక్షులు ముప్పిడి సైదులు గౌడ్.

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి మార్చి 31

విశ్వా వసు తెలుగు సంవత్సరాది ఉగాది రోజున గ్రామీణ కలల పరిరక్షణ సేవాసమితి 10 వ వార్షికోత్సవం సందర్భంగా చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని గ్రామ ఖర్చీర్ వద్ద అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగింది. జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో శ్రీ లక్ష్మీ నారాయణ యాక్షన్ గాన బృందం వెంకిర్యాల వారిచే శ్రీ రేణుక ఎల్లమ్మ చరిత్ర యాక్షన్ గాన ప్రదర్శన ప్రేక్షకులను మంత్ర ముగ్ధలను లను చేస్తూ అత్యద్భుతంగా తెల్లవారులు ముందు శ్రీ మార్కండేయ బాల భక్త సమాజం కొయ్యలగూడెం వారిచే భజన కార్యక్రమం జాహ్నవి రెడ్డి ఆధ్వర్యంలో చిన్నారులచే కూచిపూడి నృత్య కళా ప్రదర్శన, శేఖర్ కళాబృందం పలివెల వారిచే జెముడికె ప్రదర్శన చేయడం జరిగింది. అనంతరం పలువురు ప్రాముఖ్య యాక్షన్ గాన కళాకారులను సమితి తరపునసన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి. మాజీ మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు, సమితి వ్యవస్థాపకులు అధ్యక్షుడు ముప్పిడి సైదులు గౌడ్, గ్యార కిష్టయ్య, సమితి ప్రతినిధులు ఎరుకల మల్లేష్ గౌడ్,మాజీ కౌన్సిలర్ పోలోజు శ్రీధర్ బాబు, దొడ్డి రాములు, బడుగు శ్రీరాములు, చిక్క నరసింహ, డాక్టర్ శ్వేతా ప్రియాంక సుధీర్, బొబ్బిళ్ళ మురళి, ఉబ్బు వెంకటయ్య, బొంగు జంగయ్య, కొండూరు వెంకన్న గౌడ్, చింతకింది అంజయ్య గౌడ్, సుర్వి నరసింహ గౌడ్,తదితరులు పాల్గొన్నారు..



## రంజాన్ మాసం మతసామరస్యానికి ప్రతీక

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతి రెడ్డి మార్చి 31

మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ఈద్గా వద్ద రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించడం జరిగింది.ఈద్గా కమిటీ అధ్యక్షుడు ఎండి బాబా షరీఫ్ ఆధ్వర్యంలో సోమవారం రోజున ముస్లిం సోదరులకు మర్యాదపూర్వకంగా కలిసి రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసిన మాజీ మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు ఈ సందర్బంగా వెన్ రెడ్డి రాజు మాట్లాడుతూ పవిత్రమైన రంజాన్ మాసంలో చిన్నపిల్లల నుంచి మొదలుకొని వృద్ధుల వరకు కఠోర నియమాలతో ఉపవాస దీక్షలు చేయడం గొప్ప విషయమన్నారు..రంజాన్ మాసం మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు.. ఆ అల్లా ఆశీస్సులతో ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో ఉండాలని మాజీ మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు ఆకాంక్షించారు..మత సామ్రాస్యతను పెంపొందించే పండుగ రంజాన్ అని, మైనార్టీ సంక్షేమానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.రంజాన్ పర్వదినాన్ని ముస్లిం సోదరులు అందరూ అద్భుతంగా జరుపుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో రామాలయం కమిటీ చైర్మన్ బొబ్బిళ్ళ మురళి, పస్తం గంగారాములు, తదితరులు పాల్గొన్నారు.